క్లుప్తంగా

బీమా చెక్కు పంపిణీ



బీమా చెక్కు ఇస్తున్న మేనేజర్ గోవిందు

సదుం: పీఎం జీవనజ్యోతి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ గోవిందు కోరారు. బ్యాంకులో ఖాతా కలిగిన వారు ఏడాదికి ప్రీమియం రూ.436 చెల్లిస్తే కుటుంబానికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. బీమా చేసిన వారు ఒకవేళ ప్రమాదంలో మరణించినా, సహజంగా మరణించినా రూ. 2 లక్షలను కుటుంబ సభ్యులకు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఇటీవల మృతి చెందిన బయ్యారెడ్డిగారిపల్లెకు చెందిన కమలమ్మ బీమా చేసి ఉండడంతో రూ. 2 లక్షలు మంజూరైందని, గురువారం ఈ సొమ్ము తాలూకు చెక్కును మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది కిరణ్, వంశీ, చక్రి, షాజహాన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ సిద్ధరామయ్య

సదుం: స్థానిక ఎంపీపీ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన నిర్వాహకులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో వంటగదులు, పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ సిద్ధరామయ్య ఆదేశించారు. నాణ్యమైన సన్న బియ్యంతో మెనూ ప్రకారం రుచికరంగా మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 దామోదర, హెచ్ఎం శ్రీరాముల నాయక్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

మద్దతు ధరకే మామిడి కొనాలి

– ఫ్యాక్టరీ నిర్వాహకులను నిలదీసిన మామిడి రైతు నాయకులు



ఆర్ఎంఎం ఫ్యాక్టరీ నిర్వాహకులతో మాట్లాడుతున్న రైతులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలోని పలు ఫ్యాక్టరీలు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. కలెక్టర్ నిర్ణయించిన ధరను తేలికగా తీసుకుంటున్నాయి. రెండు రోజుల క్రితమే తోతాపురి రకం కేజీ రూ.12కి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అయితే కొన్ని ఫ్యాక్టరీలు వాళ్లు నిర్ణయించిన ధరలకే కాయలను కొనుగోలు చేస్తున్నాయి. తమిళనాడు నుంచి వచ్చే మామిడిపై దృష్టి సారించాయి. అక్కడ కేజీ రూ.5కే కొనుగోలు చేసి ఫ్యాక్టరీ నిర్వాహకులు జిల్లా మామిడిని చిన్నచూపు చూస్తున్నాయి. పొడికాయల పేరుతో గుజ్జు వ్యాపారాన్ని పుంజుకునేలా చేస్తున్నాయి. ఇది తెలుసుకున్న జిల్లాలోని రైతులు గురువారం చిత్తూరు నగరంలోని ఆర్ఎంఎం ఫ్యాక్టరీలోకి వెళ్లారు. గిట్టుబాటు ధరకు కాయలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ నిర్ణయించిన కేజీ ధర రూ.12కే కాయలను కొనుగోలు చేయాలని పట్టుబట్టారు. లేకుంటే ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు ఆనందనాయుడు, హరిబాబుచౌదరి, వెంకటరెడ్డి, త్యాగరాజరెడ్డి, సోమశేఖర్, మాపాక్షి, తుమ్మింద రైతులు పాల్గొన్నారు.

● ఆశీస్సులు



నూతన వధూవరులు మౌనిక, రెడ్డి ప్రసాద్‌లను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



రెడ్డి ఉషశ్రీ, ఆంజనేయులును ఆశీర్వదిస్తూ..

రొంపిచెర్ల: మండలంలోని వివిధ కళ్యాణ మండపాల్లో గురువారం రాత్రి జరిగిన వివాహ వేడుకల్లో నూతన వధూవరులను పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీర్వదించారు. జగడంవారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు హరినాథ్ కుమార్తె మౌనిక తిరుపతికి చెందిన రెడ్డి ప్రసాద్‌కు, అలాగే బుసిరెడ్డిగారిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ రవీంద్ర కుమార్తె రెడ్డి ఉషశ్రీకి అన్నమయ్య జిల్లా రాయచోటి టౌన్ కొత్తపేట రామాపురానికి చెందిన ఆంజనేయులుతో వివాహమైంది. ఎమ్మెల్యేతోపాటు పలువురు నాయకులు వారిని ఆశీర్వదించారు.

విద్యార్థులు అన్నింటా రాణించాలి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు అన్నింటా రాణించాలని చిత్తూరు డీవైఈఓ ఇందిర అన్నారు. బాలభవన్ ఆధ్వర్యంలో బీఎస్ కణ్ణన్ పాఠశాలలో నిర్వహిస్తున్న చిత్రలేఖనం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని డీవైఈఓ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, చిన్నారులు ఉత్సాహంగా చిత్రలేఖనం నేర్చుకోవడం అభినందనీయమన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు.

చెరువులు..ప్రాణాలు తీస్తున్న మట్టి గుంతలు!

- సరదాగా ఈతకెళ్లి మృతి చెందుతున్న పిల్లలు
- మట్టి తవ్వకాలతో ప్రమాదకరంగా మారిన చెరువులు
- కూటమి పాలనలో యథేచ్ఛగా చెరువులను చెరబట్టిన మట్టి మాఫియా
- తాజాగా వీకోట ఘటనలో ముగ్గురు పిల్లలు గంగపాలు



బైరెడ్డిపల్లె పెద్దచెరువులో మట్టితోడిన గుంతలో చేరిన వర్షపునీరు, (ఇన్‌సెట్) చెరువులోని గుంతల్లో ఈత కొడుతున్న పిల్లలు (ఫైల్)

పలమనేరు: వేసవి సెలవులు ముగిసే వరకూ పిల్లల తల్లిదండ్రులకు ఆందోళన తప్పడం లేదు. పిల్లల వినోదం కాస్తా విషాదంగా మారిన ఎన్నో సంఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. చెరువుల్లో మట్టికోసం తవ్విన గుంతల్లో ఇటీవల వర్షాలకు నీరు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మట్టిమాఫియా రెచ్చిపోయింది. దాదాపు అన్ని చెరువుల్లోనూ వెంచర్ల కోసం మట్టిని తోడి సర్వనాశనం చేశారు. మరోవైపు ఎక్స్‌ప్రెస్ హైవేకోసం చాలా చెరువుల్లో మట్టిని 10 నుంచి 20 మీటర్ల మేర తోడేశారు. ఇప్పుడు ఆ గుంతలే పిల్లల ప్రాణాల పాలిట శాపంగా మారాయి. దీంతో ఇవి ఎవరిని ఎప్పుడు బలి తీసుకుంటాయో తెలియని పరిస్థితి వీ.కోట ఉదంతం మరోసారి చాటిచెప్పింది. తాజాగా వీ.కోట మండలం క్రిష్ణాపురం పంచాయతీ మోట్లపల్లె చెరువులో ఈతకెళ్లిన అదే గ్రామానికి చెందిన కుషాల్(11), నిఖిల్(13), జగన్(9) గుంతలోని నీటిలో దిగి మునిగి మృతి చెందారు. ఈ చెరువులో నీరు లేకపోయినా అక్కడున్న గుంతే వీరి ప్రాణాలను కబళించింది.

పదేళ్లలో 25 మంది నీళ్లలో మునిగి మృతి

పదేళ్ల కాలంలో పలమనేరు నియోజకవర్గంలో 25 మంది నీళ్లలో మునిగి మృతి చెందారు. గతంలో పట్టణానికి చెందిన కొందరు విద్యార్థులు చెరువులో ఈతకెళ్లి మృతిచెందారు. ఇక గ్రామాల సమీపంలోని పలు చెరువుల్లో ఇటుకల కోసం లేదా ఇతర అవసరాల కోసం అక్రమార్కులు మట్టిని తోడేశారు. వీటిలోకి వర్షాల కారణంగా నీరు చేరింది. సంబంధిత చెరువు లేదా కుంటల లోతు, లోపలి పరిస్థితులు మొదలైన గురించి అవగాహన లేకపోవడంతో చివరకు ప్రాణాలు కోల్పోతున్నారని ఇప్పటివరకు జరిగిన మరణాల ఉదంతాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఇకనైనా అధికారులు చెరువులు, కుంటల పరిరక్షణకు చర్యలు తీసుకుంటారా? అనేదీ అనుమానమే.

మట్టి మాఫియా పాపం.. పిల్లలకు శాపం

కూటమి పాలన వచ్చాక దాదాపు అన్ని చెరువుల్లో ఇసుక, మట్టి తవ్వకాలు విపరీతంగా జరుగుతున్నాయి. రియల్ వెంచర్లు, ఇళ్లకు మట్టిని జేసీబీలతో తవ్వి చెరువులను చెరబట్టారు. గతంలో ఎవరైనా చెరువుల్లో మూడు అడుగులకు మించి తోడితే అప్పటికప్పుడే ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకునేవారు. కానీ కూటమి పాలనలో ఇరిగేషన్, ఎంపీడీఓలు, పంచాయతీ అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. వీరు మట్టి మాఫియాను అడ్డుకుని ఉంటే ఇలాంటి ఘటనలు చోటుచేసుకునేవా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



మట్టిమాఫియా దెబ్బకు గుంతలుగా మారి నాశనమైన బైరెడ్డిపల్లె పెద్ద చెరువు

నోటీస్ బోర్డు

మోడల్ స్కూల్ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: మోడల్ స్కూలులో ఖాళీ ఉన్న సీట్లను కేవలం ఆన్‌లైన్ దరఖాస్తు ద్వారానే భర్తీ చేస్తామని ప్రిన్సిపాల్ ఎండీకేవీ లత తెలిపారు. ఇంటర్మీడియెట్, 7,8,9 తరగతుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. వీటిని భర్తీ చేయడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఈ నెల 20వ తేదీ లోపుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 24న ప్రవేశ పరీక్షలో మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని చెప్పారు. సిఫార్సులతో సీట్లు పొందే అవకాశం పూర్తిగా లేదని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు తన కార్యాలయంలో గానీ లేదా సెల్ నంబర్ 8121848347ను గానీ సంప్రదించాలని కోరారు.

నియామకం



బాలాజి

పలమనేరు: స్థానిక పాతపేటకు చెందిన బాలాజి అవర్ విజిలెన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఆ సంఘ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సాతియా కన్నదాసన్ నుంచి గురువారం ఆయనకు నియమాక పత్రం అందింది. తాను ప్రజా సమస్యలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై పోరాడుతానని బాలాజి చెప్పారు.

రూ.20లక్షలతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తాం



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడి
- రోగులకు మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని ఆదేశం

సదుం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందివ్వడమే ప్రధాన కర్తవ్యంగా గుర్తెరిగి విధులు నిర్వర్తించాలని సీహెచ్‌సీ సిబ్బందిని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. గురువారం వైద్యశాలలో సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఆసుపత్రి అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైద్య సేవలపై ఎలాంటి ఫిర్యాదులు అందకుండా సేవలు అందివ్వాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఎంపీ నిధులు రూ.20 లక్షలతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మార్చురీ గది లేకపోవడంతో మృతదేహాలను పీలేరుకు తరలించాల్సి వస్తోందని అధికారులు ఆయన దృష్టికి తీసుకురాగా..గది నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ పుష్పకుమారి, అభివృద్ధి కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, మురళి, రమాదేవి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి



విశేషాలంకారంలో వినాయకస్వామి



విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, నాయకులు

సదుం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, విశ్రాంత హెచ్ఎం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నూతన వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, సర్పంచ్ ఉషారాణి, ఉప సర్పంచ్ బాబురెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో సమరోత్సాహం!

- క్యాడర్‌లో జోష్ నింపిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ
- ఏడాదిగా కూటమిపై ఉన్న ఆగ్రహాన్ని చాటిన జనం
- నాయకుల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం



పలమనేరులో జరిగిన వెన్నుపోటు దినం నిరసనకు వేలాదిగా తరలివచ్చిన జనం (ఫైల్)

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా హామీలను నెరవేర్చకపోవడంపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం పలమనేరులో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పుంగనూరులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ ఆపార్టీ శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపింది. ఆయా నియోజకవర్గాలోని మండలాల నుంచి పార్టీ శ్రేణులతోపాటు సామాన్యప్రజలు వేలసంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేశారు. కూటమి పాలనపై ఏడాదిగా కాలంగా ప్రజల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆగ్రహం ఎంతగా పెల్లుబికిందో ర్యాలీ అద్దం పట్టడం..కూటమికి ఇది ఒక బలమైన సందేశాన్ని ఇచ్చినట్టైంది.

ఇచ్చిన హామీలు గాలికొదిలారని కూటమిపై జనాగ్రహం

గత ఎన్నికల సమయంలో కూటని నేతలు సూపర్ సిక్స్‌తోపాటు లెక్కలేనన్ని హామీలను గుప్పించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లాగానే వీరు అమలు చేస్తారేమోనని జనం నమ్మి ఓట్లేసి పట్టం కట్టారు. కానీ ఖజానాలో డబ్బులేదని పథకాలను అమలు చేయడం అసాధ్యమని సీఎం చంద్రబాబు చెప్పడం, దీనికి తోడు భారీగా పింఛన్ల తొలగింపు, ప్రభుత్వ పథకాల్లో కోత, నిబంధనల పేరిట అర్హులను తొలగించడం లాంటివి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతను పెంచాయి. అందుకే వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ ప్రభుత్వానికి ఒక చెంపపెట్టులా మారింది.

నాయకుల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం

ఇన్నాళ్లు 'రెడ్‌బుక్' పేజీలకు సలాం కొట్టి పోలీసులు బనాయించిన కేసులకు భయపడిన నాయకులకు నిరసనకు వచ్చిన జనాన్ని చూసి ఆత్మవిశ్వాసం పెరిగినట్టైంది. దీంతో రాబోవు రోజుల్లో ప్రభుత్వంపై ప్రజల తరఫున పోరాడేందుకు వీరికి బలం లభించిందనే మాట వినిపిస్తోంది. మరోవైపు వేలసంఖ్యలో తరలివచ్చిన జనాన్ని చూసిన పోలీసులు, అధికారులు సైతం ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తోందనే విషయాన్ని పసిగట్టారు. మరోవైపు నిఘా వర్గాలు సైతం జనంలో వస్తున్న మార్పును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం.

పచ్చదనం పెంపుపైనే మానవాళి మనుగడ

– కడా పీడీ వికాస్ మర్మత్



కుప్పం రూరల్: కుప్పం బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన మానవహారం

కుప్పం రూరల్: పచ్చదనం పెంపు, పరిరక్షణపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని కుప్పం చెరువు కట్ట నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండు ఆవరణలో మానవ హారం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. మొక్కలు నాటి, అవి వృక్షాలయ్యే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపుతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని అందరూ గుర్తెరగాలన్నారు. విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటాలని కోరారు. అధికారులు పాల్గొన్నారు.

మరికొన్ని చోట్ల..

కుప్పం కంగుంది గ్రామం దొరచెరువు వద్ద అటవీశాఖ అధికారులు మొక్కలు నాటారు. రేంజర్ జయశంకర్ మాట్లాడుతూ, కుప్పం రేంజ్ పరిధిలో వివిధ రకాల వన మూలికల మొక్కలు నాటనున్నట్టు చెప్పారు. అలాగే, కుప్పం ఎంఎఫ్‌సీ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు.

- కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు మొక్కలు నాటారు. భూతాపం పెరగకుండా ఉండాలంటే విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పలమనేరు: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం 'పలమనేరు ప్రకృతి'తో కలిసి పట్టణంలోని పలు లేఔట్లలో మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రతిజ్ఞ చేయించి కమిషనర్ మాట్లాడారు. ఇళ్ల వద్ద ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటడం బాధ్యతగా తీసుకోవాలని కోరారు.

- మున్సిపల్ కార్యాలయంలో మండల స్పెషలాఫీసర్ సుధాకర్ స్వచ్ఛాంధ్ర, యోగాంధ్ర కార్యక్రమాలపై సమీక్షించిన అనంతరం పలమనేరు ప్రకృతి నిర్వాహకులు మల్లిచెట్ల దేవేంద్ర పలురకాల మొక్కలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ భాస్కర్, ఎంఈఓ బాలసుందరం, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులతో కలసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.
- పట్టణంలోని కాకాతోపు అర్బన్‌హెల్త్ సెంటర్ వద్ద డాక్టర్ చందన ప్రియ తన సిబ్బందితో కలిసి ఆస్పత్రి వద్ద మొక్కలు నాటారు.
- మొసలిమొడుగు ఎలిఫెంట్ క్యాంపు వద్ద డీఎఫ్ఓ భరణి స్థానిక అటవీశాఖ అధికారులతో వన మహోత్సవం నిర్వహించి మొక్కలు నాటారు. అడవులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రామక్రిష్ణమనాయుడు, అధ్యాపకులు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలోని బోయకొండ సమీపంలో తహసీల్దార్ హనుమంతునాయక్, అటవీశాఖ సిబ్బందితో కలిసి 17 మొక్కలు, బోయకొండ ఆర్ఆర్ కాలనీలోని ఎంపీపీ స్కూల్ ఆవరణలో ఎంపీడీఓ లీలామాధవి, ఉపాధి ఏపీఓ ధనయ్య తో కలిసి చెరో పది మొక్కల చొప్పున నాటారు. పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని కోరారు.






పలమనేరు: మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఆస్పత్రి వద్ద డాక్టర్ చందనప్రియ, చౌడేపల్లె: బోయకొండలో, ఆర్ఆర్ కాలనీ స్కూల్‌లో ఎంపీడీఓ లీలామాధవి






కుప్పం రూరల్: కంగుంది అటవీ ప్రాంతం దొరచెరువు వద్ద మొక్కలు నాటుతున్న అధికారులు, ఇంజనీరింగ్ కళాశాలలో, గుడుపల్లె: జూనియర్ కాలేజీలో.., పలమనేరు: విద్యార్థులకు మొక్కలు పంపిణీ

సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ



విత్తన కాయలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

పలమనేరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలోని పెంగరగుంట రైతు సేవా కేంద్రంలో గురువారం సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల పంపిణీని ప్రజాప్రతినిధులతో కలసి మండల వ్యవసాయ అధికారిని సంధ్య ప్రారంభించారు. విత్తనాలు పొందిన రైతులు తప్పనిసరిగా సాగు చేయాలని, వర్షాధార పంటగా సాగుకు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ భువనేశ్వరి, నాయకులు నాగరాజ, జగదీష్‌నాయుడు, పెద్దబ్బ, నక్షత్రయ్య, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సదుంలో..



సదుం: విత్తనాల కోసం వేచి ఉన్న రైతులు

సదుం: మండలంలో వేరుశనగ విత్తన పంపిణీ గురువారం ప్రారంభించినట్లు ఏఓ మాధవి తెలిపారు. మండలంలోని 9 రైతు సేవా కేంద్రాలలో 910 మంది రైతులకు 420 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేసామని చెప్పారు. ఊటుపల్లె, పాలమంద కేంద్రాలలో శుక్రవారం పంపిణీ చేస్తామన్నారు. ఇదలా ఉంచితే, విస్తీర్ణం ఎంత ఉన్నా ఒక బస్తానే ఇస్తుండడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పులిచెర్లలో..



పులిచెర్లలో వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్లలో గురువారం వేరుశనగ విత్తనకాయలను ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి పంపిణీ చేశారు. మండలానికి 712 క్వింటాళ్ల విత్తనకాయలు వచ్చాయని, కదిరి-6రకం కావలసిన రైతులు 1బి ,ఆధా జెరాక్సు తీసురురావాలని మండల వ్యవసాయశాఖాధికారి హరిప్రసాద్ తెలిపారు. సబ్సిడీ పోను రైతు రూ.1674 చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరి, నాయకులు చంద్రశేఖరరెడ్డి, గోవిందరెడ్డి, వంగిమళ్ల లోక, నాగరాజ ప్రసాద్, రెడ్డి అహమ్మద్, గోవర్ధన్, మునిరత్నం, వాసుదేవరెడ్డి, మునస్వామి, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.